క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్‌వో సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం 93వవార్డు పరిధి గణేష్‌కాలనీకి చెందిన కరక వలస నాగభూషణరావు అనే దాత లక్షా 1016 విరాళం సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రం లో పీఆర్‌వో సునీల్‌కి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ ఇచ్చారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిని అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభ యదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

'దేవస్థానం సిబ్బంది తీరు దారుణం'

సింహాచలం: పంచగ్రామాల్లో శిథిలమైన ఇళ్లను తిరిగి నిర్మించుకుందామన్నా, మరమ్మతులు చేయిస్తున్నా సింహాచలం దేవస్థానం అధికారుల తీరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీపీఐ నాయకుడు బి.వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. సింహగిరి ఘాట్‌రోడ్డులో ఓ ఇంటి వద్ద గచ్చు చేస్తుండగా భూపరిరక్షణ విభాగం అధికారులు గార్డులతో వెళ్లి తొలగించడాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. పంచగ్రామాల్లో ప్రజలు అధికారుల తీరుతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా అధికారులు ఈ విషయంపై జోక్యం చేసుకుని దేవస్థానం సిబ్బంది చేస్తున్న దాడులను ఆపాలని, లేకపోతే పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

పంచగ్రామాల భూ సమస్యపై ధర్నా నేడు

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కారం చేయాలని సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలంలోని కొండదిగువ జంక్షన్‌లో ఉదయం 10.30 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాధితులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

8న దివ్యాంగుల శ్రేయోదాయక మహాసభ

పరవాడ: లూయిస్ బ్రెయిలీ జయంతి పురస్కరించుకుని ఈ నెల 8న పరవాడ మరిడిమాంబ ఫంక్షన్ హాలులో 'ఉమ్మడి విశాఖ జిల్లా దివ్యాంగుల శ్రేయోదాయక మహాసభ' నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ సత్యవతమ్మపాల్గొంటున్నారని చెప్పారు. మహాసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అర్జునరావు కోరారు.

ప్రకాష్‌నగర్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో ధాన్ ఫౌండేషన్, మల్కాపురం కళంజియా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. నగరంలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వైద్యులు క్యాన్సర్ వ్యాధి ఎలా వస్తుంది, శరీరంలో కలిగే మార్పులు, లక్షణాలు తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బేంటీన, క్యాంప్ కో ఆర్డినేటర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత వైఎస్ జగన్‌దే

● ఎమ్మెల్యే అదీప్‌రాజ్
● వంగలిలో ఉత్సాహంగా గడప గడపకు..

సబ్బవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని వంగలిలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కొంత మంది పట్టాదారు పాస్ పుస్తకాలు, సీసీ డ్రైన్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయా శాఖల అధికారులతో చర్చించి సకాలంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో 66 మంది కి జగనన్న గృహాలు మంజూరు చేశామన్నారు. వంగలి నుంచి సబ్బవరం వరకూ రూ.60 లక్షలతో బీటీ రోడ్డు అభివృద్ధి, రూ.3.15 లక్షలతో కోటపాడు రోడ్డు నుంచి వంగలి మీదుగా చోడవరం రోడ్డును అనుసంధానం చేశామని తెలిపారు. చంద్రబాబు పాలనను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను చూసి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు.



సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సచివాలయ అదనపు అంతస్తు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభంతో పాటు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ రూ.44.60 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాబాగంగా రూ.38.44 లక్షలతో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆధునికీకరణ పనులను, రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ అదనపు అంతస్తును ప్రారంభించారు. గ్రామంలోని బొడ్డెమాంబ ఆలయ నిర్మాణానికి తన సొంత నిధులు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ డ్రైన్లు అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నేరాలతల్లి అమ్మవారి ఆలయం వద్ద సొంత నిధులతో కల్వర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అజయ్ రాజ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ గవర తులసి, ఎంపీడీవో రమేష్ నాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, నాయకులు గవర రాజు,యర్ర శ్రీనివాసరావు,కోట్ని అమ్మతల్లినాయుడు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణకు డిమాండ్

పరవాడ: ఫార్మాసిటీలో స్మైలెక్స్ పరిశ్రమలో గురువారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమలో భద్రత ప్రమాణాలు సక్రమంగా పాటించని కారణంగా గతంలో ఇద్దరు కార్మికులు, ఇప్పుడు మరోక కార్మికుడు మృత్యువాత పడ్డారన్నారు. ప్రమాదంపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరిశ్రమలో భద్రత ప్రమాణాలపై ఆడిట్ నిర్వహించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి

పరవాడ: ఫార్మాసిటీలో భద్రత ప్రమాణాలు పక్కాగా అమలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నేత రాజాన దొరబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరుస ప్రమాదాల్లో మంది కార్మికులు మరణిస్తున్నా పరిశ్రమల యాజమాన్యాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. స్మైలెక్స్ పరిశ్రమలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించి గాయపడిన అప్పారావుకు మెరుగైన వైద్యం అందించడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని దొరబాబు డిమాండ్ చేశారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పెందుర్తి వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు



వెంకటాద్రిపై గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: ధనుర్మాసం పూజలు శుక్రవారం సింహగిరితో పాటు పలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం, సాత్తుమొరై అనంతరం గోదాదేవి తిరువీధి నిర్వహించారు. విశేష ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు శ్రీకాంతాచార్యులు పూజలు చేశారు.

వెంకటాద్రిపై

పెందుర్తి వెంకటాద్రికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం తిరుప్పావై సేవాకాలం విశేషంగా నిర్వహించారు. గోదాదేవికి విశేష పూజలు.. వెంకన్నకు పలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలను నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో....

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి విశేష అలంకరణ చేసి వేదికపై వేంచేయజేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ్ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



93వవార్డులో పింఛన్ అందజేస్తున్న దాసరి రాజు



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు

సింహాచలం: పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ పండగలా సాగుతోంది. అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. తమకు ముందే పండగ వచ్చిందని వృద్ధులు, వితంతువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన ప్రతీ హామీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి తమకు భరోసా ఇచ్చారని సంబరపడుతున్నారు.

● జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు గొల్లవిల్లివానిపాలెంలో శుక్రవారం పింఛన్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు రూ. 2750 నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రతీ గడపకూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిప్పల చందు, ఆకుల చెల్లారావు, దొడ్డి పద్మ, ఆకుల వాసు, కంచిబోయిన సంతోష్, వెంకటేష్, మంగమ్మ, ఆర్పీ కనకమహాలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలవటీర్లు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని సింహాద్రినగర్‌లో శుక్రవారం వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు రూ. 2750 పింఛన్ నగదు లబ్ధిదారులకు అందజేశారు. అలాగే కొత్తగా మంజూరైన ఇద్దరు దివ్యాంగ చిన్నారులకు రూ.3 పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు బి.అప్పలరాజు, రాజు, దాసరి సత్తిబాబు, ఆర్పీ కమలాదేవి, పాల్గొన్నారు.



95వ వార్డులో పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ దేముడు

అవ్వాతాతలకు భరోసా

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అంతకాపల్లిలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అములు చేశారన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు పెంచిన పింఛన్ రూ.2,750 చొప్పున లబ్ధిదారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఉప సర్పంచ్ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?



అధ్వానంగా మారిన వెంకటాపురం రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి-వెంకటాపురం రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలిన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు నిత్యం నరకం చూస్తున్నారు. రాళ్ల వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన రహదారి ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రైతులు తమ ఫలసాయాలను పట్టణ ప్రాంతాలకు తరలించే క్రమంలో రహదారిలో పడరాని పాట్లు పడుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో నిర్ణీత సమయానికి పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు అంటున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి రహదారి మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కల్యాణమండపం వినియోగంలోకి తేవాలి

సింహాచలం: చినముషిడివాడ వుడాకాలనీలో వీఎంఆర్‌డీఏ నిర్మించిన కల్యాణ మండపంలో అన్ని సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. కల్యాణమండపాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సుమారు రూ. 7కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం ఏడాదిన్నర కిందట ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభోత్సవం జరిగినా ఇంత వరకు కార్యకలాపాలు మొదలు కాలేదన్నారు. ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వరకు ప్రజలకు ఉపయోగదాయకంగా ఉండే కల్యాణం మండపం వినియోగంలోకి తేకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. పేద వర్గాలను దృష్టిలో ఉంచుకుని కల్యాణమండపం అద్దె రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 97వ వార్డు టీడీపీ నాయకుడు శానాపతి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బూడిద లారీల అడ్డగింత



బూడిద లారీ ఎదుట ఆందోళనకు దిగిన స్థానికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి బూడిద తరలిస్తున్న లారీ ఢీ కొట్టడడంతో కలపాక శివారు గొల్లలపాలెం గ్రామానికి చెందిన బొంతాడ నగేష్ గురువారం రాత్రి స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదం విషయం తెలిసినా యాష్ పాండ్ కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో శుక్రవారం గొల్లలపాలెం గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి రోడ్డుపై బైఠాయించి బూడిద లారీలను అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలకు వేగంగా రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలే కారణమని ఆరోపించారు. బూడిద లారీల కారణంగా ఎగిసిపడుతున్న బూడిద వల్ల తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని వాపోయారు. అయినా లారీల యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 7 సమయాల్లో బూడిద లారీలను రోడ్లపై తిరగకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లేశ్వరరావు ఘటన స్థలానికి వెళ్లి సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. దీంతో ఆందోళన విరమించారు. నాయకులు చప్పా సన్యాసిరావు, బొట్టా నూకరాజు, శ్రీను, ఎన్.రమేష్, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయాలంటే ఇష్టం

బాలభాను పాఠశాల సందర్శనలో విదేశీయులు



బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలంటే తమకెంతో ఇష్టమని విదేశీయులు అన్నారు. గురుపూజోత్సవాల సందర్భంగా శుక్రవారం మురళీనగర్ బాలభాను పాఠశాలలో ఈస్ట్ వెస్ట్ బ్రదర్ హుడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్, జర్మనీ, అర్జెంటీనా దేశాలకు చెందిన 40 మంది విశాఖ పర్యటనలో భాగంగా ఈ స్కూల్‌ను సందర్శించారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా బోధనా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, వారు అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులు, ఆచార వ్యవహారాలను వీరు దగ్గరుండి పరిశీలించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఆచరణీయమైనవన్నారు. విదేశీ వనితలు తెలుగు సంప్రదాయ దుస్తులు, చీరలు ధరించి సందడి చేశారు. ఆస్ట్రేలియా నుంచి రోసీ డియాజ్ డ్యూక్ గ్రూప్, జర్మనీ నుంచి రాబర్ట్ బడియా గ్రూప్, స్పెయిన్ నుంచి లూడ్జర్ ఫిలిప్స్ గ్రూప్ సభ్యులు, అర్జెంటీనా కంట్రీ గ్రూప్ నుంచి ఆల్‌బెర్ట్ బెలిజి, క్రిస్టియానా యూఎస్‌ఏ గ్రూప్ నుంచి మిక్వెల్, రోజా సర్రోసా తదితరులు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి, బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ రామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణరావు పాల్గొన్నారు.

వామనుడిగా దర్శనమిచ్చిన అప్పన్న



వామన అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి వామనావతారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వామనుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేసి.. ఆళ్వారులను మరో పల్లకిలో సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

రోడ్డు ప్రమాదాలపై మహిళలకు అవగాహన



గుర్రంపాలెంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: రోడ్డుపై ప్రయాణం సాగించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మీ కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు చెప్పాలని మహిళలకు వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ సూచించారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం సాగించవచ్చన్నారు. చిన్నపొరపాటు ఎంతో అనర్థాన్ని తెచ్చిపెడుతుందని.. ఇంట్లో చీకటి నింపుతుందని తెలియజేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించేలా చూడాలని సూచించారు. అలాగే కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించాలని.. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవ్ చేయడం, సిగ్నల్ క్రాసింగ్, ఓవర్‌స్పీడ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మేయర్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

మల్కాపురం: నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని శుక్రవారం విశాఖ పశ్చిమ నియోజక వర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.మేయర్ నివాసంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులను మేయర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


9న నివాస హక్కుల పోరాటంపై సదస్సు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మి, నాయకులు

సీతమ్మధార : ఈనెల 9న నివాస హక్కుల పోరాట దినంపై డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఈ సదస్సులో కేంద్ర ఇంధన శాఖ పూర్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ప్రారంభోపన్యాసం చేయనున్నారని తెలిపారు. రైతాంగ ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఆశిష్‌మిట్టల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని అన్నారు. యూసీడీ డిపార్ట్‌మెంట్ కేటాయించిన 40 శాతం నిధులను మురికివాడల అభివృద్ధి, ఉపాధికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కన్వీనర్ ఈసర లక్ష్మి, కో-కన్వీనర్ పరదేశి, అప్పారావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి, బాలనాగమ్మ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నిర్మల, దళిత విముక్తి కన్వీనర్ ఎస్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి రూ. లక్ష విరాళం



ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులకు చెక్కు అందజేస్తున్న దాత మహేష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఆగమ పాఠశాల విద్యార్థుల సంక్షేమం నిమిత్తం నగరంలోని బీహెచ్‌పీవీ దరి అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఆకుల మహేష్ అనే దాత రూ.లక్ష ఇచ్చారు. సింహగిరిపై సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో నాయుడు, దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది(భీమిలి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరాజు పట్టు వస్త్రాలను తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం అభిషేకం, పుష్ప నివేదన చేసి, శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు.